ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి

గోపాలపట్నం: ఓటరు నమోదు కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. మర్రిపాలెం వుడా లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం బీఎల్‌ఏలు, గృహసారథులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు నమోదు సక్రమంగా జరిగేలా చూడాలని సూచించారు. అర్హత ఉన్న వారికి ఓటు హక్కు కల్పించడం మన బాధ్యతని పేర్కొన్నారు. ఏవిధంగానైనా గెలవాలని చూస్తున్న టీడీపీ నాయకులు దొంగ ఓట్లు నమోదు చేయిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి వాటిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని చెప్పారు. ఒకే ఇంటి నంబర్‌లో ఎక్కువ ఓట్లు నమోదవుతున్నాయో పరిశీలించాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు మాట్లాడుతూ బూత్ లెవల్ ఏజెంట్లు, నాయకులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఓటర్ల నమోదు చేసినపుడు ఎదురయ్యే సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. బీఎల్‌వోలు దరఖాస్తులను తీసుకోవడంలో గానీ.. నమోదులో గాని అభ్యంతరాలు వ్యక్తం చేస్తే తక్షణం సమాచారమివ్వాలన్నారు. దొంగ ఓట్లు నమోదు చేసిన వారి వివరాలు, ఓటర్ల వివరాలు సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 89వ వార్డు నాయకుడు అయితంశెట్టి గోపాలకృష్ణ, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్

గౌరీపరమేశ్వరులకు విశేష పూజలు

సింధియా: ఉత్తరాంధ్రలో అత్యంత ఘనంగా జరిగే ఉత్సవాల్లో శ్రీ గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ఒకటని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు.

జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్‌లో కొలువైన శ్రీగౌరీపరమేశ్వరులను శనివారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు గౌరీపరమేశ్వరుల కృపాకటాక్షాలు ఉండాలని కోరారు. అనంతరం అలయ కమిటీ సభ్యులు పూలమాలలతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమం వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ , వార్డు కార్పొరేటర్ లక్ష్మణరావు,నాయకులు భీశెట్టి గణేష్, ఆడారి నాగరాజు, పీలా అనంత్ పాల్గొన్నారు.


గౌరీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

పంచ గ్రామాల సమస్య పరిష్కరించాలి

గోపాలపట్నం: పంచగ్రామాల సమస్యలు పరిష్కరించాలని గోపాలపట్నం డివిజన్ కార్యదర్శి బలివాడ వెంకటరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గోపాలపట్నం సీపీఎం కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎటువంటి దరఖాస్తులు, నిబంధనలు లేకుండా ఇళ్ల మరమ్మతులు, నిర్మాణాలు చేసుకునే విధంగా ఉండాలన్నారు. కోర్టుల్లో ఉన్న భూ వివాదాలు సమసిపోయే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

సింహపురి లేఅవుట్‌కు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

సింహాచలం: గోపాలపట్నంలో ఉన్న జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని వేపగుంట నుంచి సింహాచలం వెళ్లే బీఆర్‌టీఎస్ మెయిన్‌రోడ్డులోని 98వవార్డు సింహపురి లేఅవుట్‌కు మార్పు చేశారు. సింహపురి లేఅవుట్ ఆర్చి పక్కన కొత్తగా నిర్మించిన భవనంలోకి మార్పు చేసిన కార్యాలయాన్ని శనివారం రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ విశాఖపట్నం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ జి.బాలకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా రిజిస్ట్రార్ ఎం. సృజన, డిస్ట్రిక్ రిజిస్ట్రార్(ఎంవీ అండ్ ఆడిట్)కె.మన్మథరావు, గోపాలపట్నం సబ్ రిజిస్ట్రార్ పీవీఎస్.మాధవికుమారి, రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్లు కె.ఎస్.బాబ్జి, రమేష్ కుమార్ బెహరా తదితరులు పాల్గొన్నారు.


నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డీఐజీ బాలకృష్ణ

విద్యార్థులకు పోటీలు


విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న జాకబ్ రాజు, నందవరపు సోములు

గోపాలపట్నం: బాలల దినోత్సవం సందర్భంగా గోపాలపట్నం కళాసేవా పీఠం ఆధ్వర్యంలో శనివారం బాలికల ఉన్నత పాఠశాలలో కళలు- వాటి విశిష్టత అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి ప్రభుత్వ ఐటీఐ విశ్రాంత ప్రిన్సిపాల్ జాకబ్ రాజు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాసేవా పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు నందవరపు సోములు, ప్రభుత్వ జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఎంఎస్. శ్రీనివాసరావు, బాలికల పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం డీవీ కామేశ్వరి, గౌరవ అధ్యక్షుడు కంపర అప్పారావు, అధ్యక్షుడు గౌరకల అప్పారావు, చందు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

హాస్యం పంచిన వినోదవల్లరి

సీతంపేట: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో క్రియేటివ్ కామెడీ క్లబ్ ప్రత్యేక వినోద వల్లరి కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు వేముల భాస్కరాచారి ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులు కామెడీ స్కిట్లు ప్రదర్శించి కడుపుబ్బా నవ్వించారు. సభ్యులు మేడా మస్తాన్‌రెడ్డి, హరిప్రసాద్, దుర్గాప్రసాద్, జి.వి.త్రినాథ్, డి.ఆర్.కె.రావు, తాళాభక్తుల లక్ష్మీప్రసాద్, పంతుల లలిత ప్రదర్శించిన ఆడ నాలూక, కారు వేలం పాట, మత్స్య సంప్రదాయం, సూసైడ్ వద్దురా, గొప్ప సలహా నాటికలు నవ్వులు పూయించాయి. ఈ సందర్భంగా నటరాజ నృత్యనికేతన్ చిన్నారులు జానపద నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, గ్రంథాలయ ఉద్యమకారులు వెలగా హరి సర్వోత్తమరావు తదితరులు పాల్గొన్నారు.


కామెడీ స్కిట్ ప్రదర్శిస్తున్న క్లబ్ సభ్యులు

మూక్స్ కోర్సులతో బహుళ ప్రయోజనం


ఇందిరను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: విద్యార్థుల అభ్యున్నతికి మూక్స్ కోర్సులు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తాయని ఐబీఎస్ ఇండియా ఇ లెర్నింగ్ విభాగం డీన్ డాక్టర్ ఇందిర కోనేరు అన్నారు. శనివారం ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశమందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో 'ఓఇఆర్ అండ్ మూక్స్ ఫర్ లైఫ్ లాంగ్ లెర్నింగ్' అంశంపై ప్రసంగించారు. ఓఇఆర్, మూక్స్ వల్ల ఉపయోగాలను వివరించారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం డాక్టర్ ఇందిరను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణతో ఆర్థిక వ్యవస్థకు ముప్పు

కూర్మన్నపాలెం: దేశ ఆర్థిక వ్యవస్థకు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణతో తీవ్ర ముప్పు వాటిల్లనుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలి లోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షల్లో 1010 వ రోజు, శనివారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధ్వంసకర ప్రయత్నాలకు అండగా ఉంటూ, వాటిని అమలు జరిపే అధికారులకు కార్మికులు ఐక్య పోరాటాలతో గుణపాఠం నేర్పుతారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటే మంచిదని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.


ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

క్లీన్ విశాఖే లక్ష్యం

ఆరిలోవ: క్లీన్ ఆంధ్రప్రదేశే ధ్యేయంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. జీవీఎంసీ 13వ వార్డు పరిధి ముడసర్లోవ ఎం.ఎస్.ఎఫ్‌లో పారిశుధ్య యంత్రాలను వార్డు కార్పొరేటర్ కెల్ల సునీతతో కలిసి ఆమె ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 310.87 లక్షలు ఖర్చుచేసి బాక్ హో లోడర్లు, మినీ ఎక్స్‌కవేటర్లు, మొబైల్ టాయిలెట్లను కొనుగోలు చేసినట్లు తెలిపారు. వీటి ద్వారా నగరం మరింత పరిశుభ్రంగా ఉంచవచ్చన్నారు. విశాఖను చెత్త, ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిద్దిడానికి చేపడుతున్న చర్యల్లో భాగంగా వీటిని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆమె తెలిపారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉత్తర్వులు మేరకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.20 కోట్లు వ్యయం చేసి వాహనాలు, పరికరాలు, బిన్లు, కొనుగోలు చేయడానికి పరిపాలనా ఆమోదం పొందిందన్నారు. దీంతో ప్రస్తుతం జీవీఎంసీకి అవసరమైన 4 బాక్ హో లోడర్లు, 9 మినీ ఎక్స్‌కవేటర్లు, 4 మొబైల్ టాయిలెట్లు కొనుగోలు చేశామన్నారు. వీటిని అవసరాన్ని బట్టి పలు జోన్లకు సర్దుబాటు చేస్తా మన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, పర్యవేక్షక ఇంజినీరు కృష్ణారావు, జోన్-2 జెడ్సీ కనకమహాలక్ష్మి, పలువురు ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.


మొబైల్ టాయిలెట్లు ప్రారంభిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

వెంకన్నకు లక్ష తులసి పూజ

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి సన్నిధిలో పవిత్రోత్సవాల్లో భాగంగా రెండోరోజు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి లక్ష తులసి అర్చన విశేషంగా చేశారు. ఈవో నీలిమ, ఆలయ సేవకులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం యాగశాల అర్చన, వేంకటేశ్వర హోమం, సాయంత్రం గోదా పద్మాదేవి సహిత వేంకటేశ్వరస్వామి కల్యాణం జరుగుతాయి.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు గడువు పెంపు

విశాఖ విద్య: సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే టెన్త్, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలకు గడువు పెంచినట్లు డీఈవో ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 వరకు ఎటువంటి అపరాధ రుసుమ లేకుండా తగిన ధృవీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రూ.200ల ఫైన్‌తో ఈ నెల 30 వరకు అవకాశం ఉందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సమీపంలోని ఓపెన్ స్కూల్ కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

సిస్టర్ ఆలిస్ మేరీ అస్తమయం

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ సిస్టర్ ఆలిస్ మేరీ(86) శనివారం తుది శ్వాస విడిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. కొద్ది రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. దాదాపు 60 సంవత్సరాల క్రితం ఫ్రాన్స్ నుంచి భారతదేశం వచ్చిన ఆమె, విశాఖ సెయింట్ జోసెఫ్ కళాశాలలో కెమిస్ట్రీ అధ్యాపకురాలిగా చేరారు. అనంతరం ప్రధానాచార్యులుగా, కరస్పాండెంట్‌గా, పరీక్షల నియంత్రణ అధికారిగా సేవలందించారు. జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ చర్చ్‌లో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు అంత్యక్రియలు జరుగుతాయని సిస్టర్ షైజీ తెలిపారు.


సిస్టర్ ఆలిస్ మేరీ (ఫైల్)

పోలీస్ సిబ్బంది క్వార్టర్స్‌కు మరమ్మతులు

అల్లిపురం: పోలీస్ సిబ్బంది క్వార్టర్స్‌కు మరమ్మతులు జరిపి, పిల్లలు ఆడుకునేందుకు పార్కు, ఆట వస్తువులు ఏర్పాటు చేయాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన అల్లిపురం పోలీస్ క్వార్టర్స్‌తోపాటు, కొత్తగా నిర్మిస్తున్న కాన్ఫరెన్స్ హాల్, ఇతర భవనాలను పరిశీలించారు. ఆఫీసర్స్ క్లబ్‌ను సందర్శించిన ఆయన వసతి గదులు, పరిసరాలు పరిశీలించారు.

క్లుప్తంగా

గ్రంథాలయంలో చిత్రకళా ప్రదర్శన


చిత్రాలను తిలకిస్తున్న విద్యార్థులు

మల్కాపురం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో శనివారం చిత్రకళా ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని చిత్రకారుడు సుంకర చలపతిరావు, రచయిత సత్తిరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిత్రాలు సమాజాన్ని ప్రతిబింబిస్తాయన్నారు. మన మనోభావాలను తెలియజేయడానికి చిత్రాలు ఎంతో దోహదపడతాయన్నారు. 64 కళల్లో చిత్రకళకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాది విశ్వనాథ్‌రాజు, పౌర హక్కుల సంఘం ప్రతినిధి టి.శ్రీరాంమూర్తి, చిత్రకారుడు మనోహర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సందడిగా బాలల దినోత్సవం


ఫ్యాన్సీ డ్రెస్సుల్లో అలరిస్తున్న చిన్నారులు

గోపాలపట్నం: ఎన్ఏడీ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో శనివారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని చీఫ్ జనరల్ మేనేజర్ పిజు నెవరే జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కిండర్ గార్డెన్ చిన్నారులు ఫ్యాన్సీ డ్రెస్సుల్లో అలరించి సందడి చేశారు. వీరు చేసిన సందేశాత్మకమైన సృజనాత్మక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎన్ఏడీ అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యాచకులకు దుప్పట్ల పంపిణీ


జ్ఞానాపురం వద్ద అనాథకు దుప్పటి అందిస్తున్న ఫౌండేషన్ సభ్యుడు

గోపాలపట్నం: జేడీ ఫౌండేషన్ సభ్యులు శనివారం ఫుట్ పాత్‌లపై జీవిస్తున్న యాచకులకు దుప్పట్లు పంపిణీ చేశారు. గోపాలపట్నం నుంచి జ్ఞానాపురం వరకు ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న అనాథలకు వీటిని అందించారు.

కల్యాణం.. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అదిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాన్ని అర్చకులు అందజేశారు. ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి జనతాకాలనీలో జరుగుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులను వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు బల్ల లక్ష్మణరావు శనివారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పనులు వేగంగా పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలే పర్యవేక్షణ చేయాలని అధికారులకు సూచించారు. మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్ సారథ్యంలో తమ వార్డు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు సంతోష్, మళ్ల వాసు, పెద్దాడ ప్రసాద్, నక్కా సూర్యనారాయణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


మెట్ల మార్గాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

మహిళల ఐక్యతతో ఆర్థిక ప్రగతి


ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న మహిళలు


ప్రతిజ్ఞ చేస్తున్న కళాంజియ సంఘం ప్రతినిధులు, సభ్యులు

మల్కాపురం/సింధియా: పారిశ్రామిక ప్రాంతంలో శనివారం మల్కాపురం కళాంజియ పొదుపు సంఘాల ఆవిర్భావం, ఉద్యమ వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా 59వ వార్డు నెహ్రూనగర్, ఇందిరా కాలనీ, 61వ వార్డు జనతా కాలనీ ప్రాంతాల్లో ధాన్ ఫౌండేషన్ వైజాగ్ రీజనల్ కో ఆర్డినేటర్ రామ్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళంజియా పొదుపు సంఘాల మహిళలు ఐక్యంగా ఆవిర్భావ దిన వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. 18 ఏళ్లుగా పొదుపు సంఘం మహిళలకు అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. మహిళలు దీపాలు వెలిగించి అంతా ఐక్యంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో యూసీడీ సీవో భాను, సమాఖ్య కో ఆర్డినేటర్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

- ఏకేసీ కాలనీ, కుంచుమాంబ కాలనీ, కాకరలోవ, దుర్గానగర్, చింతల్లోవ ప్రాంతాల్లో కళాంజియ సమాఖ్య పొదుపు సంఘాల ఆవిర్భావ దిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. యూసీడీ సీవో భాను మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సదుపాయాలన్ని కళాంజియ సమాఖ్య సభ్యులకు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. క్లస్టర్‌లో ఉన్న మహిళలు తమ కంటే పేద వారికి బియ్యం, దుప్పట్లు, నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో 40వ వార్డు సీవో శివ, సచివాలయ సిబ్బంది ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

జీపీఎఫ్ రుణాలు సకాలంలో మంజూరు చేయాలి

విశాఖ విద్య: ఉపాధ్యాయులకు జీపీఎఫ్ లోన్లు సకాలంలో మంజూరు చేసేలా తగిన చొరవ తీసుకోవాలని జెడ్పీ సీఈవో పోలినాయుడుకు పీఆర్‌టీయూ ఉమ్మడి విశాఖ జిల్లా కన్వీనర్ గోపీనాథ్ కోరారు. శనివారం జెడ్పీ సీఈవోను కలసి ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. ఇటీవల కాలంలో జరిగిన ఉపాధ్యాయుల బదిలీల నేపథ్యంలో జీపీఎఫ్ ఖాతాలను అప్‌డేట్ చేయాలన్నారు. సాంకేతిక సమస్యలతో కొంతమంది ఉపాధ్యాయుల పీఎఫ్ ఖాతాల్లో వేతనాల నుంచి మినహాయించిన డబ్బులు జమ కావటం లేదన్నారు. దీనిపై చొరవ తీసుకొని ఉపాధ్యాయులకు మేలు చేసేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు.అదే విధంగా పీఎఫ్ స్లిప్పులు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా అధ్యక్షులు ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

స్టీల్‌క్లబ్ ఎన్నికలకు ముగిసిన నామినేషన్ల స్వీకరణ

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-1 స్టీల్‌క్లబ్ పాలకవర్గం ఎన్నికల నామినేషన్ల ఘట్టం ముగిసింది. అన్ని పోస్టులకు అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ నెల 26న జరగనున్న పాలకవర్గం ఎన్నికలకు సంబంధించి శనివారం నామినేషన్లు స్వీకరించారు. ఎన్నికల అధికారి జె.వి.రావు నేతృత్వంలో జరిగిన ప్రక్రియలో కార్యదర్శి పోస్టులకు పెంటకోట రామకృష్ణ, ఎన్.వీరాస్వామి, ఎస్.ఎల్.ఎన్.రావు, ఎస్.వి.సత్యనారాయణ నామినేషన్లు దాఖలు చేశారు. సంయుక్త కార్యదర్శి పోస్టుకు కోన సత్యనారాయణ, డి.వేణుగోపాల్, జి.సురేష్, కర్రి సుమాంజలి పోటీలో ఉన్నారు. కోశాధికారి పోస్టుకు ఆర్.సత్యనారాయణ, కుంచె సత్యనారాయణ నామినేషన్లు వేశారు. గ్రూప్-1కు చెందిన రెండు పోస్టులకు ముగ్గురు అభ్యర్థులు బి.వి.రమణ, వై.రవికుమార్, డి.ఉమామహేష్ నామినేషన్లు దాఖలు చేశారు. గ్రూప్-2లోని ఐదు పోస్టులకు 8 మంది అభ్యర్థులు కె.ఎల్.నరసింహం, ఎం.కృష్ణయ్య, బి.చిట్టిబాబు, పి.పరమేశ్వర రెడ్డి, ఎ.శివశంకర రెడ్డి, ఎ.శ్రీనివాస వర్మ, వి.అప్పలరాజు, వి.ఎస్.బి.రాజు నామినేషన్లు వేశారు.

అద్భుతం.. నృత్యరూపకం

మద్దిలపాలెం : ఆకాశ గంగను ధరిణిలోకి రప్పించడంలో భగీరథుడు ప్రయత్నం ఎలా ఫలించిందనే అపురూప నాట్య రూపాకాన్ని అద్భుతంగా ఆవిష్కరించారు. కళా సరిత్సాంగరంస గ్రంథ కర్త అయిల సోమయాజులు జోగారావు కలం నుంచి జాలువారిన భగీరథ విలాసం నృత్యనాటకానికి మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమి 23వ వార్షికోత్సవం సందర్భంగా ప్రదర్శించారు. వీఎండీఏ వార్షికోత్సవ సంబరాలను ఆదాయ పన్నుల శాఖ మాజీ కమిషనర్ సూదగాని రవిశంకర్ నారాయణ్ ప్రారంభించారు. కూచిపూడి డ్యాన్స్ గురువు కేవీ లక్ష్మి నిర్దేశకత్వంలో జరిగిన ఈ వేడుకల్లో తొలి ప్రదర్శనగా ప్రముఖ కూచిపూడి నాట్యకళాకారిణి సూదాగాని గీతానారాయణ్ శివరంజని రాగంలో మహేశ్వరి మహాకాళి నృత్యాన్ని ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈసందర్భంగా కేవీ లక్ష్మి మాట్లాడుతూ వీఎండీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తిన విక్రమ్ గౌడ్ పాత్ర అనితర సాధ్యమని కొనియాడారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా కోల్‌కతా ఆదాయ పన్నుల శాఖ కమిషనర్ బి.సత్యనారాయణ, ఆదాయ పన్నుల శాఖ (అప్పిల్స్) మనోజ్‌కుమార్, రమణమూర్తిలు పాల్గొన్నారు.


భగీరథ విలాసంలో నృత్యరూపకం